# దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి 40 వ వర్ధంతి (01-11-1897 & 24-02-1980)

సినిమా పాటలకు కూడా కావ్య గౌరవాన్ని ఉంచిన రచయితలలో ముఖ్యులు. కాకినాడ పి ఆర్ గవర్న మెంట్ కాలేజీలో లెక్చరర్ గా పని చేసే రోజుల్లో శ్రీ బి ఎన్ రెడ్డి గారి కోరికపై మద్రాసు వెళ్ళి, మల్లీశ్వరి చిత్రానికి మాటలు, పాటలు రాయడం మన తెలుగు వారి అదృష్టం. అలా మల్లీశ్వరితో మొదలు పెట్టి, బంగారు పాప, భాగ్య రేఖ , రాజ మకుటం , బంగారు పంజరం, సుఖదు:ఖాలు, ఉండమ్మా బొట్టు పెడతా, ఏకవీర, మాయని మమత, అమ్మ మనసు, శ్రీ రాజ రాజేశ్వరి కాఫీ క్లబ్, సీతా మాలక్ష్మి , శ్రీ రామ పట్టాభిషేకం, గోరింటాకు, కార్తీక దీపం, చిత్రాలకు అద్భుతమైన పాటలు రాసేరు.

మనసున మల్లెలమాలలూగితే రేయంతా హాయి నిండుతుందా? మావిచిగురు తింటే కోయిల ఎలా పాడుతుంది? అచ్చంగావచ్చే వసంతరాత్రిలో శృంగార గరిమ ఎలాగుంటుంది? గగనసీమలో స్వేచ్ఛగా విహరించే మేఘం ప్రేమ సందేశాన్ని ఎలా మోసుకొస్తుంది? ప్రియుని జాడ ఎలా తెలుసుకుంటుంది? మనసు తెలిసిన ఆ మేఘమాలది జాలిగుండె కాదా? సఖియ రాకుంటే వసంతమాసం ఆగుతుందా? మోయలేని హాయిని ఒక్క క్షణం మోయలేదా? ఆకాశపందిరిలో పెళ్లిజరిగితే దేవతలు పురోహితులుగా, అప్సరసలు పేరంటాళ్లుగ రావడం సాధ్యమా?... వీటన్నిటికీ సమాధానాలు దేవులపల్లి కృష్ణ శాస్త్రి భావ కవితలే.

మీగడ తరకల్లాంటి జుబ్బా, పంచెకట్టు, ఉత్తరీయం, బంగారు రంగు శరీరం, వెండి గిరజాల జుట్టుతో భావకవితా ప్రపంచానికి చక్రవర్తిలా, తన కవిత్వంలాగే అందంగా భాసిల్లిన పదనిర్దేశకుడు. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. సినిమాలకు ప్రత్యేకించి అయన రాసిన పాటలు తేనెలూరే తెలుగుదనంతో పరిమళాలు వెదజల్లుతాయి.

శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కవితా సంపుటికి చలం యోగ్యతాపత్రం రాస్తూ 'కృష్ణశాస్త్రి తన బాధని అందరిలో పలికిస్తే శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ... ప్రపంచపు బాధంతా శ్రీశ్రీ బాధ' అని రాశాడు. అయితే శ్రీశ్రీ తను కృష్ణశాస్త్రి కవితా శైలినే అనుకరించేవాడిని అని చెప్పుకున్నాడు. 'తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు. అటువంటి కవిపుంగవుడు దివికేగి సరిగ్గా 24 ఫిబ్రవరి నాటికి 40 యేళ్ళు. ఇన్నేళ్లయినా దేవులపల్లి కవితలు, సినిమా పాటలు నేటికీ నిత్యనూతనంగా వినిపిస్తూనే, కనిపిస్తూనే వున్నాయి. కృష్ణశాస్త్రి వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకాలను కొన్ని గుర్తుతెచ్చుకుందాం...

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం దగ్గరలో వుండే చంద్రపాలెంలో నవంబరు 1, 1897న కృష్ణశాస్త్రి జన్మించారు. ఆ రోజుల్లో దేవులపల్లి సోదరకవులు (సుబ్బారాయ శాస్త్రి, వెంకట కృష్ణశాస్త్రి) పిఠాపుర సంస్థానంలో విద్వత్కవులుగా వుండేవారు. వారిలో 'తమ్మనశాస్త్రి'గా వాసికెక్కిన వేంకట కృష్ణశాస్త్రి దేవులపల్లి తండ్రి. వీరి ఇంటిలో నిరంతరం సాహిత్య గోష్ఠి జరుగుతూ వుండేది. ఆ వాతావరణంలో పెరిగిన కృష్ణశాస్త్రి పదవ యేటనే 'నందనందన ఇందిరానాథ వరదా' అనే పద్యం రాశారు. సాహిత్యకృషి సల్పుతూ తన పదహారవ యేటనే అష్టావధానం నిర్వహించి 'ఒహో' అనిపించుకున్నారు. పాఠశాల విద్యాభ్యాసం పిఠాపురంలో పూర్తిచేసి 1919లో కాకినాడ పిఠాపురం రాజా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను, బి.ఎ డిగ్రీని విజయనగరం కళాశాలలోను చదివారు. విద్యార్థి దశలోనే గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషావాదం, బ్రహ్మ సమాజ ఉద్యమ ప్రభావం కృష్ణశాస్త్రి మీద ప్రబలంగా ఉండేవి. పెద్దాపురం మిషనరీ పాఠశాలలోను, కాకినాడ పి.ఆర్. హైస్కూలులోను ఉపాధ్యాయునిగా పని చేశారు. అలాగే తెలుగు ట్యూటర్‌గా పి.ఆర్.కళాశాలలో కూడా పనిచేశారు.

'జయము జ్ఞాన ప్రభాకరా జయము క్రాంతి సుధాకరా' అనే ప్రార్థనా గీతాన్ని బ్రహ్మ సమాజం కోసం రచించారు. అప్పుడే సాహితీ వ్యాసంగం కొనసాగిస్తూ 'జయజయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి, జయజయజయ శత సహస్ర నరనారీ హృదయనేత్రి' అనే దేశభక్తి గీతాన్ని పాఠశాల విద్యార్థుల కోసం రాశారు. వాశిలో విశ్వకవి రవీంద్రుని 'జనగణమన అధినాయక జయహే' అనే మన జాతీయగీతం కన్నా

ఏమాత్రం తక్కువగా అంచనా వేయజాలని అద్భుత దేశభక్తి ప్రార్థనా గీతమిది. ‘జయజయ సుశ్యామల సుస్యామచల చేలాంచల... జయ వసంత కుసుమలతా చరిత లలిత చూర్ణ కుంతల... జయ మదీయ హృదయాశయ లక్షారుణ పదయుగళా... జయ దిశాంత గత శకుంత దివ్యగాన పరితోషణ జయగాయక వైతాళిక గళ విశాలపథ విహరణ... జయ మదీయ మధురగేయ చుంబిత సుందర చరణ’ అంటూ భారతమాత దేవభూమికి జయం పలుకుతూ సాగే ఈ ప్రార్థనాగీతానికి స్వాతంత్ర్యోదమ సమయంలో వింజమూరి అనసూయాదేవి బాణీ కట్టింది.

1920లో వైద్యం కోసం బళ్లారి వెళ్ళినప్పుడు ఆ ప్రకృతి శోభను ఆస్వాదిస్తూ ‘కృష్ణపక్షం’ ఖండకావ్యాన్ని రచించారు. 1922లో భార్య రాజహంస కాలం చెయ్యడం కృష్ణశాస్త్రిని బాధించింది. అప్పుడే కరుణాత్మకమైన కవితలు రాశారు. వాటిలో ‘కన్నీరు’ అనే ఖండకావ్యాన్ని ఉదహరించాలి. తరువాత పునర్వివాహం చేసుకొని భావ కవితోద్యమ సారధ్యం వహిస్తూ దేశమంతటా తిరిగారు. పిఠాపురంలో హరిజనోద్ధరణ కార్యక్రమాల్లో పాల్గొంటూ వుండడంతో బంధువర్గం కృష్ణశాస్త్రిని వెలివేసింది. 1929లో ‘ఊర్వశి’, ‘ఆత్మాశ్రయత్వం’, ‘ఊహాప్రేయసి’, ‘ప్రవాసము’ వంటి కవితలతో పుస్తకాలు ప్రచురించారు. అదే సంవత్సరం విశ్వకవి రవీంద్రునితో పరిచయమైంది. 1941 వరకు కాకినాడ కళాశాలలో పనిచేశారు. ‘అమృతవీణ’ వంటి గేయ మాలికలు, ‘అమూల్యాభిప్రాయాలు’ వంటి వ్యాసావళి, ‘బహు కాలదర్శనం’, ‘ధనుర్దాసు’ వంటి నాటికలు, ‘మంగళకాహళి’ వంటి దేశభక్తి గీతాలు, సంగీత రూపకాలు రచించారు. కృష్ణశాస్త్రికి బెజవాడ గోపాలరెడ్డి అత్మీయమిత్రులు కావడంతో ఆయనను వాహినీ పిక్చర్స్ అధినేత బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. చలనచిత్ర రచన చేయమని బి.ఎన్.రెడ్డి కృష్ణశాస్త్రిని పలుమార్లు కోరినా ఆయన అంత ఆసక్తి చూపలేదు. చివరికి బి.ఎన్.రెడ్డి, కృష్ణశాస్త్రిని మద్రాసుకు మకాం మార్చేలా చేశారు.

‘వందే మాతరం’ షూటింగు కోసం బి.ఎన్.రెడ్డి హంపికి వెళ్ళారు. శ్రీకృష్ణదేవరాయలు మీద వున్న ఆరాధనాభావంతో బి.ఎన్.రెడ్డి కృష్ణదేవరాయల నేపథ్యంలో సినిమా నిర్మించాలని ఆంధ్ర, ఆంగ్ల సాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేశారు. రచయిత బుచ్చిబాబు రాసిన ‘రాయల కరుణకృత్యం’ నాటిక, ఇలస్ట్రేటెడ్ వీక్లీలో వచ్చిన కథను సమన్వయం చేస్తూ ఒక కథ అల్లారు. ఆ కథను కృష్ణశాస్త్రి అభివృద్ధి చేసి, స్క్రిప్టు తయారు చేశారు. మల్లీశ్వరి నాగరాజు ముందు ప్రదర్శించిన నృత్యగానాలను మారువేషంలో ఉన్న రాయలు, అల్లసాని పెద్దన చూసినప్పుడు అల్లసాని మల్లీశ్వరిని ఆశువుగా ఓ పద్యంలో మెచ్చుకునే సన్నివేశం వుంది. అల్లసానివారి అల్లిక జిగిబిగి అనే నానుడి వుండడంతో, అదే ధోరణిలో పద్యం రావాలని చెప్పి బి.ఎన్.రెడ్డి కృష్ణశాస్త్రి చేత వంద పద్యాలు రాయించి అందులోంచి ‘భళిరా ఎన్నడు జారె నీభువికి రంభా రాగిణీ రత్న మేఖలయో నిర్జర వల్లభ ప్రియవధూ కంఠస్రవద్ధామమో...’ అనే పద్యాన్ని ఖరారు చేశారు.

చిత్రీకరణ విషయంలో బి.ఎన్.రెడ్డి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. దేవులపల్లి మాటలతోబాటు, ఇందులో రాసిన పాటలన్నీ విశేషంగా జనాదరణ పొందాయి. పాటలన్నీ కథా సంబంధంగా రాసినవి కావడం విశేషం. ఈ సినిమాలో కథాంశాలైన ప్రణయం, అనురాగం, విజయనగర వైభవం, వేదన వంటి కోణాల్లో పాటలు రాశారు కృష్ణశాస్త్రి. 1951లో విడుదలైన ఈ చిత్రం గొప్ప క్లాసిక్‌గా సంచలనం సృష్టించడంతో, కృష్ణశాస్త్రి ఉత్తమ శ్రేణి సినీకవిగా గుర్తింపు పొందారు. తొలుత సినిమా రంగం మీద పెద్దగా ఆసక్తి లేకున్నా కొన్ని సినిమాలకు అద్భుతమైన పాటలు రాశారు.

‘నాయిల్లు’ (1953) చిత్రంలో ‘అదిగదిగో గగన సీమ’, ‘బంగారుపాప’ (1954)లో ‘యవ్వన మధువనిలో వన్నెల పూవులా ఉయ్యాలా’; ‘భాగ్యరేఖ’ (1957)లో ‘నీవుండేదా కొండపై నాస్వామి నేనుండేదీ నేలపై’, ‘రాజమకుటం’ (1959)లో ‘సడిసేయకో గాలి సడిసేయబోకే’ వంటి అద్భుతమైన పాటలు రాశారు. అలా సినిమాలకు పాటలు రాస్తూనే, ఆకాశవాణికి రేడియో రూపకాలు రాసేవారు. దాంతో హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో ‘ప్రయోక్త’గా చేరమని ఆహ్వానం అందింది. జెమినీ వాసన్, బి.ఎన్.రెడ్డి వంటి వారు ఒత్తిడిచేసి మద్రాసులోనే కొనసాగే ప్రయత్నం చేసినా కృష్ణశాస్త్రి ఆకాశవాణిలో చేరేందుకే మొగ్గుచూపారు. హైదరాబాదుకు వచ్చిన రోజుల్లోనే 1958లో కూతురు సీత మశూచి సోకి మరణించడంతో కృష్ణశాస్త్రి మరలా మద్రాసుకు మకాం మార్చారు. ఆకాశవాణిలో వుండగా ‘విప్రనారాయణ’, ‘క్షీరసాగర మథనం’ వంటి యక్షగానాలు అద్భుతంగా రాసి ప్రదర్శింపజేశారు.

1964లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. అతని వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్ళారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. ఎవరితోనైనా మాట్లాడాలన్నా, చెప్పాలన్నా కాగితం మీద రాసి చూపేవారు. కృష్ణశాస్త్రి పాటలు మనసు లోతుల్లోంచి వచ్చేవి. భావోద్వేగాలకు పెద్దపీట వేసేవారు. 'మల్లీశ్వరి' తరువాత కృష్ణశాస్త్రి 'రాజీ నాప్రాణం', 'నాయిల్లు', 'రాజగురువు' వంటి కొన్ని చిత్రాలకు పాటలతోబాటు మాటలు కూడా రాశారు. తరువాత పాటలకు మాత్రమే పరిమితమయ్యారు.

కృష్ణశాస్త్రి రాసిన కొన్ని లలిత గీతాలు సినిమా పాటలుగా రూపొందాయి. వాటిలో... 'బంగారు పంజరం' చిత్రంలో 'పదములె చాలు రామా', 'గట్టుకాడ ఎవరో, సెట్టు నీడ ఎవరో', 'భక్తశబరి'లో 'ఏమి రామకథ శబరీ శబరీ ఏదీ మరియొకసారి', 'రాక్షసుడు' చిత్రంలో 'జయజయజయ ప్రియభారత జనయిత్రీ దివ్య ధాత్రి', 'ఆనంద భైరవి' చిత్రంలో 'కొలువైతివా రంగశాయి' పాటలు కొన్ని మాత్రమే.

కృష్ణశాస్త్రి 24 ఫిబ్రవరి 1980న మరణించిన విషయం తెలిసిందే. 1983లో ప్రముఖ దర్శక నిర్మాత దాసరి నారాయణరావు 'మేఘసందేశం' సినిమా నిర్మించి అందులో కృష్ణశాస్త్రి రాసిన మూడు లలిత గీతాలను ఉపయోగించుకున్నారు. 'ఆకులో ఆకునై పూవులో పూవునై', 'ముందు తెలిసెనా ప్రభూ ఈ మందిరమిటులుంచేనా', 'సిగలో అవి విరులో అగరు పొగలో అత్తరులో' అనేవి 'మేఘసందేశం' చిత్రంలో వినియోగించిన లలితా గీతాలు.

'మల్లీశ్వరి' చిత్రంలో పాటలు ప్రకృతి శోభను ప్రతిబింబించాయి. ముఖ్యంగా 'పరుగులు తీయాలి గిత్తలు ఉరకలు వేయాలి', 'మనసున మల్లెలు మాలలూగెనే', 'ఎందుకే నీకింత తొందరా', 'నా ఇల్లు' చిత్రంలో 'అదిగదిగో గగనసీమ అందమైన చందమామ', 'వచ్చేనమ్మా సంక్రాంతి పచ్చని వాకిట చేమంతి' వంటి పాటలు ఈ కోవలోకి వస్తాయి. కృష్ణశాస్త్రి రాసిన విరహగీతాలు అద్భుతాలే. 'మల్లీశ్వరి'లో 'ఎడతానున్నాడో బావా జాడ తెలిసిన పోయిరావా అందాల ఓ మేఘమాలా', 'ఉండమ్మా బొట్టుపెడతా'లో 'ఎందుకీ సందెగాలి సందెగాలి తేలి మురళి', 'కలసిన మనసులు' చిత్రంలో 'ఒక్క క్షణం ఒక్క క్షణం నన్ను పలకరించకు నావైపిటు చూడకు' పాటలు చెప్పుకోవచ్చు. కృష్ణశాస్త్రి ఎన్నో ప్రణయ గీతాలు, భక్తి గీతాలు, విషాద గీతాలు కూడా రాశారు. వాటిలో కొన్ని పాటలు చెప్పాలిస్వస్తే...

ఆకాశ వీధిలో హాయిగా (మల్లీశ్వరి) , ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=IeSrqNP5PJQ

ఆనంద మోహనా (కార్తవరాయని కథ) ఎన్ టి ఆర్ , సావిత్రి
https://www.youtube.com/watch?v=rr5R9y21j6Q

ఎవరో వచ్చే వేళాయె , మాయని మమత, ఎన్ టి ఆర్, బి సరోజా దేవి
https://www.youtube.com/watch?v=VLSRsKswEj8

ఔనా నిజమేనా (మల్లీశ్వరి) ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=GqIZTpCnSjY

భలిరా (మల్లీశ్వరి) ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=HQjuY8qvT9A

ఈ గంగకెంత దిగులు (శ్రీ రామ పట్టాభిషేకం) , ఎన్ టి ఆర్, సంగీత
https://www.youtube.com/watch?v=U_sm3fhpC1Y

ఎందుకే నీకింత (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=eKFZKOL5FDE

ఎవరు ఏమని విందురు (మల్లీశ్వరి) , ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=eJ5_tqiDIxw

ఝుం ఝుం (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, టీ జి కమల
https://www.youtube.com/watch?v=1dtOYL4_Z2Q

కనిపెట్టగలవా మగువ, ఏకవీర , జమున, ఎన్ టి రామారావు
https://www.youtube.com/watch?v=Z_lKZbeXF2s

కోతీ బావకు (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=agO1MLwz_Mo

మనసూగె (భాగ్యరేఖ), ఎన్ టి ఆర్, జమున
https://www.youtube.com/watch?v=_OvEnQbSiwg

మనసున మల్లెల (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=_RGC_lAgunY

నవ్వుల నదిలో (మర్మ యోగి),
https://www.youtube.com/watch?v=rIdnPS0lR2Q

నీ సిగ్గే సింగారమె (భాగ్య రేఖ), ఎన్ టి ఆర్, జమున
https://www.youtube.com/watch?v=MYlz6NIOYMw

నీల మోహనా (డాక్టర్ ఆనంద్), ఎన్ టి ఆర్, కాంచన
https://www.youtube.com/watch?v=W_i8IJtMsZA

నోమీ నోమల్ల లాలో (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=3N-3Ulxon2E

ఔనే చెలియా, ఏకవీర, కె ఆర్ విజయా, ఎన్ టి రామారావు ,
https://www.youtube.com/watch?v=7wdbucJpKzI

పరుగులు తీయాలి (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=6D8ax64STOk

పిలచిన బిగువటరా (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=QPw96StPG9k

ప్రతి రాత్రి (ఏకవీర), ఎన్ టి ఆర్, కాంతారావు, జమున, కె ఆర్ విజయ
https://www.youtube.com/watch?v=vh4b7xVsHmY

రావి చెట్టు తిన్నె చుట్టూ (మల్లీశ్వరి), ఎన్ టి ఆర్, భానుమతి
https://www.youtube.com/watch?v=9rLxYkV9u48

రానిక నీకోసం (మాయని మమత), ఎన్ టి ఆర్, బి సరోజాదేవి
https://www.youtube.com/watch?v=QtRVtb3O_kk

సడి సేయకో గాలి (రాజ మకుటం), ఎన్ టి ఆర్, రాజ సులోచన
https://www.youtube.com/watch?v=7zr58T7Q384

శ్రీరస్తు శుభమస్తు, విజయం మనదే, ఎన్ టి ఆర్, దేవిక
https://www.youtube.com/watch?v=vbgOJ4FhHoE

అడుగడుగున గుడి ఉంది , ఉండమ్మా బొట్టు పెడతా , జమున
https://www.youtube.com/watch?v=URpp8byXq7Q

ఆకాశ పందిరిలో , శ్రీ రాజ రాజేశ్వరీ కాఫీ క్లబ్ , జయప్రద

ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం, శోభన్ బాబు, శారద, శ్రీదేవి
https://www.youtube.com/watch?v=6A0oDuS-LYc

చాలులే నిదురపో , ఉండమ్మా బొట్టు పెడతా , జమున
https://www.youtube.com/watch?v=61yM-O2e5iE

చుక్కలతో చెప్పాలని, ఉండమ్మా బొట్టు పెడతా , జమున , కృష్ణ
https://www.youtube.com/watch?v=eQpyMH7n46I

ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈ నాటి ఈ బంధం ఏనాటిదో, జయప్రద
https://www.youtube.com/watch?v=ZeJ88Zj9nTk

గట్టుకాడ ఎవరో, బంగారు పంజరం, శోభన్ బాబు, వాణిశ్రీ, ఎస్ జానకి
https://www.youtube.com/watch?v=RqRB2rhxD9Q

గోరింట పూచింది, గోరింటాకు, సావిత్రి
https://www.youtube.com/watch?v=arIy_0j9CuM

ఇది మల్లెల వేళయని, సుఖ దు: ఖాలు, వాణిశ్రీ,
https://www.youtube.com/watch?v=u7fTAoOzH7M

మనిషే మారెరా రాజా, బంగారు పంజరం , శోభన్ బాబు, వాణిశ్రీ
https://www.youtube.com/watch?v=CC3JtSkwNBI

మావి చిగురు తినగానె, సీతా మా లక్ష్మి, చంద్రమోహన్, తాళ్ళూరు రామేశ్వరి
https://www.youtube.com/watch?v=I2oOIU8ds00

నా పేరు బికారి, శ్రీ రాజ రాజేశ్వరీ కాఫీ క్లబ్ ,కృష్ణ
https://www.youtube.com/watch?v=GIIZDfY8NAk

పాడనా తెలుగు పాట, అమెరికా అమ్మాయి
https://www.youtube.com/watch?v=r2yxqDOk18A

పగలైతే దొరవేరా, బంగారు పంజరం, శోభన్ బాబు, వాణిశ్రీ
https://www.youtube.com/watch?v=QZA4mCIG7AI

రావమ్మా మహాలక్ష్మీ, ఉండమ్మా బొట్టు పెడతా, జమున , కృష్ణ
https://www.youtube.com/watch?v=W7uVLgmsviQ

శ్రీశైలం మల్లన్నా శిరసొంచెనా, ఉండమ్మా బొట్టు పెడతా, జమున , కృష్ణ
https://www.youtube.com/watch?v=OO_KREUq0bg

తా ధిమి తక ధిమి , బంగారు పాప, ఎస్ వి ఆర్, జగ్గయ్య, కృష్ణ కుమారి
https://www.youtube.com/watch?v=lABmUat-cjM

కృష్ణశాస్త్రికి అనేక సన్మానాలు, ప్రశంసలు లభించాయి. 1976లో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ‘పద్మభూషణ్’ అవార్డునిచ్చి గౌరవించింది. 1978లో సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. 1975లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదునిచ్చి సత్కరించింది. ప్రఖ్యాత వ్యంగ్యచిత్రకారుడు, సాహితీవేత్త ‘బుజ్జాయి’ కృష్ణశాస్త్రి కొడుకే. చందమామలోని చల్లదనాన్ని, మందారపువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట.